క్లుప్తంగా

ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని రైతువేదికలో ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ ఫర్టిలైజర్ డీలర్లతో జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఏడీఏలు రాంకిషన్, గణేశ్‌లు సమావేశం నిర్వహించారు. డీలర్లు స్టాక్ బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలని, రిజిస్టర్లు తప్పనిసరిగా రాయాలన్నారు. రైతులకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

జొన్న కొనుగోళ్లు ప్రారంభం



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ గోడం వర్ష సునీల్

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో శుక్రవారం జైనథ్ మార్కెట్ కమిటీ, డోప్టాల సహకార సంఘం ఆధ్వర్యంలో జొన్న కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ గోడం వర్ష సునీల్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి కాంబ్లే మధుకర్, డోప్టాల సహకార సంఘం చైర్మన్ జితేందర్, సర్పంచ్ ఇంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు ఠాక్రే గంభీర్, జక్కుల మధుకర్, సతీశ్‌పవార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన మోతె సునీల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ తుల శ్రీనివాస్ బాధిత కుటుంబానికి రూ. 10 వేల నగదు శుక్రవారం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, పిప్పల్‌ధరి సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, భీంరావ్, తుల శ్రీనివాస్ ఇర్ల అఖిల్, ఉప్పు ఉదయ్, తుల హరీష్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రం కొనసాగించాలి

బేల: బేలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ పరీక్ష కేంద్రం కొనసాగించాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. గత మూడేళ్లుగా బేలలో కొనసాగిన పరీక్ష కేంద్రాన్ని ఎలాంటి సమాచారం లేకుండా జిల్లా కేంద్రానికి మార్చడం సరికాదన్నారు. 600కు పైబడి విద్యార్థులు డిగ్రీ పరీక్షలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వెంటనే యూనివర్సిటీ అధికారులు స్పందించి, పునరాలోచించి డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని బేలలో శాశ్వతంగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో అశోక్‌రెడ్డి, సబ్దార్, రాము, శివకిరణ్‌రెడ్డి, కాంత పాల్గొన్నారు.

నెలనెలా చెల్లించాలి

నేరడిగొండ: వడ్డీలేని రుణాలు పొందాలంటే నెలనెలా కిస్తీలు చెల్లించాలని సీసీ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళ సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందన్నారు. తీసుకున్న రుణాలను ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లించాలని కోరారు. సమావేశంలో మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని నర్సాపూర్(జె) గ్రామ పంచాయతీకి వెళ్లే మార్గంలో వంతెన లేక ప్రతీ ఏడాది నర్సాపూర్(జె), ఆడగూడ, భీంగూడ, జెండాగూడ, లేండిగూడ గ్రామాల ఆదివాసీలు ఇబ్బంది పడుతున్నారని టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ ఆరోపించారు. వెంటనే వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై సమస్యలపై చర్చించారు. ఆయన వెంట నాయకులు కనక మల్కు, నర్సాపూర్, సర్పంచ్ ఆత్రం విషంరావు, గ్రామ పటేళ్లు కిషన్, జంగు, అక్బర్‌షావ్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బేల: మండలంలోని సాంగిడి గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ 1996– 97బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులు శుక్రవారం సదల్‌పూర్ శివారులోని బైరందేవ్, మహదేవ్ ఆలయాల ప్రాంగణంలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 26 ఏళ్ల తర్వాత ఒకచోట కలవడంతో చదువుకునే రోజుల్లోని జ్ఞాపకాలను పంచుకున్నారు. యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, దీపక్, వెంకన్న, దివాకర్‌రెడ్డి, విఠోబా పాల్గొన్నారు.

కళాశాల లేక.. చదువుకోలేక

- ఇతర మండలాలకు వెళ్తేనే మాధ్యమిక విద్య
- 'పది'తోనే చదువులు బంద్
- సిరికొండలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని వేడుకోలు



సిరికొండ మండల కేంద్రం

సిరికొండ: ప్రతిఒక్కరికీ విద్య, వైద్యం అందించాలనే ప్రభుత్వాల లక్ష్యం. ప్రతీ విద్యార్థికి విలువలతో కూడిన విద్యను అందిస్తేనే పేదరికం అరికట్టవచ్చు. గత కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం నూతన జిల్లాలతో పాటు మండలాలు ఏర్పాటు చేసింది. సిరికొండను మండలంగా ఏర్పాటు చేశారుగాని ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు పదో తరగతితోనే చదువు ఆపేస్తున్నారు. కిలోమీటర్ల దూరం వెళ్లి చదువుకోలేక వ్యవసాయ పనులు, ఇతర పనులకు వెళ్తున్నారు.

కళాశాల లేక..

2016లో సిరికొండను నూతనం మండలంగా ఏర్పాటు చేశారు. మండలంలో అధికంగా గిరిజన గ్రామాలే ఉన్నాయి. మండల కేంద్రంతో పాటు రాయిగూడ, రిమ్మ గ్రామంలో ఆశ్రమ పాఠశాలలు, పదో తరగతి వరకు పాఠశాలలున్నాయి. పదో తరగతి పూర్తి కాగానే.. ఇంటర్ చదవాలంటే గిరిజన విద్యార్థులు ముందుగా మండల కేంద్రానికి చేరుకోవాలి. అక్కడి నుంచి ఇచ్చోడ, ఇంద్రవెల్లి వెళ్లి ఇంటర్ చదువుకోవాల్సి వస్తోంది. దీంతో సమయ భావం, ఆర్థికంగా నష్టపోతున్నారు. సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో మధ్యలోనే చదువు మానేసి, తల్లిదండ్రులకు వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి

సిరికొండ మండలంలో విద్యార్థులు అధిక శాతం ఉన్నారు. వీరంతా మండలంలో ఇంటర్ కళాశాల లేకపోవడంతో మధ్యలో చదువు మానేసి ఇతర పనులు చేసుకుంటున్నారు. దీంతో వారి భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికైనా నూతనంగా ఏర్పాటు చేసిన సిరికొండ మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి



నూతన మండలం ఏర్పాటు చేసి ప్రభుత్వ కళాశాల ఏర్పాటులో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. విద్యతోనే అనేక మార్పులు సాధించవచ్చు. గిరిజన విద్యార్థులు చదువులు మధ్యలో మానేయకుండా ఉండాలంటే ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలి.

– పెందూర్ అమృత్‌రావు, ఎంపీపీ

ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



సిరికొండ మండల కేంద్రంలో ఇంటర్ కళాశాల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు ఇతర మండలానికి వెళ్లి చదవాల్సిన పరిస్థితి. అనేక మంది పేద విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారు.

– సాయిని స్వామి, యువసేన యూత్ అధ్యక్షుడు, సిరికొండ

అధికారులు స్పందించాలి



ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి. కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతోంది. ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి.

– రాథోడ్ వికాస్, తుమ్మల్

తాగునీటి కష్టాలు



తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) పంచాయతీ పరిధిలోని రాజుల్‌వాడీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని ఒకే బావిపై గ్రామస్తులు ఆధారపడుతున్నారు. వాటర్ ట్యాంకు ద్వారా సరఫరా చేసే నీరు ఏ మాత్రం సరిపోవడం లేదు. ట్యాంకు వద్ద బిందెలు, దబ్బాలతో క్యూ కడుతూ.. వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి భగీరథ నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'పద్మశాలీలను విస్మరిస్తే ఊరుకోం'



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోథ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి 15 వర్గాలకు మాత్రమే సాయం ప్రకటించడం, అందులో పద్మశాలి కులం పేరు లేకపోవడం దారుణమని సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం కొట్లాడిన కొండ లక్ష్మణ్ బాపూజీ, ఆలె నరేందర్‌లు పద్మశాలి వర్గానికి చెందినవారని గుర్తుచేశారు. వెంటనే పద్మశాలీలకు రూ.లక్ష అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆసాల సదాశివ్, పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న, జక్కుల వెంకటేశ్, మాసం అనిల్, బూస రాము, వడ్లకొండ సురేందర్, వేముల చంద్రమోహన్, కొండ స్వామి, ఆడెపు కిరణ్, వేముల కిష్టయ్య, తడక పోశెట్టి పాల్గొన్నారు.

'ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు'



మాట్లాడుతున్న సోసయ్య హీరాసింగ్

నేరడిగొండ: ఏం సాధించారని బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు సోసయ్య హీరాసింగ్ ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు చేసే పనులను దశాబ్ది ఉత్సవాల పేరిట సీఎం కేసీఆర్ అడ్డుకోవడం సరికాదన్నారు. బతుకమ్మ, బోనాల పండుగ అంటూ చెరువులు, కుంటలు, వాగుల వద్దకు తిప్పడం అవసరమా అని ప్రశ్నించారు. గత నాలుగేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు రాలేవని, డబుల్ బెడ్‌రూం ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. ఉద్యోగులకు కూడా నెలనెలా జీతం రావట్లేదని మండిపడ్డారు. సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కపల్లి రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు గంధం నవీన్, ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి శీను, ప్రకాష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'గొల్లకుర్మలను అవమానిస్తున్న ప్రభుత్వం'



మాట్లాడుతున్న గొర్ల రాజుయాదవ్

బోథ్: గొల్ల కుర్మలను ప్రభుత్వం అవమానిస్తోందని యాదవ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొర్ల రాజుయాదవ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గొర్ల పంపిణీ చేయాల్సి ఉండగా.. ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని రద్దు చేయడం తమను అవమానించినట్లేనని మండిపడ్డారు. గొర్లు ఇప్పిస్తామని చెప్పి గొర్లకుర్మలను ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు తీసుకువెళ్లి పనికిరాని గొర్రెలను చూపించారని అన్నారు. కనీసం భోజనం, ఉండేందుకు కనీస వసతులు కల్పించలేదన్నారు. ఒక్కొక్కరు రూ.43,750 కట్టిన డబ్బులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎట్టం ముత్యం, గొర్ల గంగయ్య, ఓల్కరి పోతన్న, ఎక్కర్ల సతీశ్, సాంగెరి నారాయణ పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు కోరిన గొర్రెలను పంపిణీ చేయాలని యాదవ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. రెండో విడతలో భాగంగా కర్నూల్, అనంతపూర్, నంద్యాల, ఇతర ప్రాంతాల్లో గొర్రెల కొనుగోలు కోసం తీసుకెళ్లారని, అధికారులు కొంతమంది దళారులతో కుమ్మక్కు అయినట్లు ఆరోపించారు. మహారాష్ట్రలో నాణ్యమైన గొర్రెలు ఇప్పించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రఘువీర్ యాదవ్ పాల్గొన్నారు.

'తమ వృత్తిలోకి వచ్చి పొట్టకొడుతున్నారు'

ఆదిలాబాద్‌రూరల్: కార్పొరేట్ కంపెనీలు తమ కులవృత్తిలోకి వచ్చి తమ పొట్ట కొడుతున్నాయని నాయీబ్రాహ్మణులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ పట్టణంలో నూతనంగా ప్రారంభం కానున్న సెలూన్ ఏర్పాటును వ్యతిరేకించారు. మావల మండలంలోని ఓ గార్డెన్ శుక్రవారం నిర్వహించిన సంక్షేమ సంబురాల సభావేదిక వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. అధికారులు ప్రగతినివేదిక చదువుతున్న సమయంలో ప్లకార్డులతో నినాదాలు చేశారు. నాయీబ్రాహ్మణ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జోగు రామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌ల ఫొటోలు పెట్టుకొని కార్పొరేట్ సెలూన్ ఓపెన్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే జోగు రామన్న జోక్యం చేసుకొని వాళ్లని పిలిపించి మాట్లాడుతానని హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం ఆదిలాబాద్‌లో నూతనంగా ఏర్పాటు కానున్న సెలూన్ షాప్ ఎదుట ఆందోళన చేపట్టారు.

ఎన్నికల కోసమే గొర్రెల పంపిణీ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ చేస్తామంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త దుకాణానికి తెరలేపిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా 2,400 మంది గొల్ల కురుమలు రూ. 42,700 డీడీ కడితే కేవలం 48 మందికి మాత్రమే మంజూరు చేశారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. గొల్ల కురుమలను మోసం చేస్తున్న ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గొర్ల రాజుయాదవ్, వెంకట్ యాదవ్, స్వామి యాదవ్, రమేశ్ పాల్గొన్నారు.

కులసంఘాలను మోసం చేస్తున్న కేసీఆర్

బేల: సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు కులసంఘాలను నమ్మించి మోసం చేస్తున్నాడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. జిల్లాలో అత్యధికంగా ఉన్న పద్మశాలిలకు ఎమ్మెల్యే జోగు రామన్న కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం కానీ చేసేందేమి లేదన్నారు. బీసీలందరు ఐక్యతతో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, ఠాక్రే మురళీధర్, ముకుంద్‌రావు, రాందాస్, ఠాక్రే సందీప్, ధర్నే జీవన్, రాము, నవీన్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు సరిచేశారు



సరి చేసిన విద్యుత్ తీగలు

సాక్షి ఎఫెక్ట్..

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని పోచమ్మగల్లి వీధిలో ఇనుప స్తంభం వంగి తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఈవిషయాన్ని సాక్షిలో 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' అనే శీర్షికన గురువారం మినీ కథనాన్ని ప్రచురించింది. దీనికి విద్యుత్‌శాఖ ఏఈ శ్రావణ్ స్పందించారు. సిబ్బందితో విద్యుత్ తీగలకు మరమ్మతులు చేయించారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, శ్రీనివాస్‌లు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్టీయూ సంఘ భవనంలో 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగంలో ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల సాధన కోసం ముందుంటామన్నారు. పీఆర్సీ అమలు చేయాలని, మధ్యాంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రవీందర్, నరేందర్, దిలేష్ చౌహాన్, సత్యనారాయణ, రవికుమార్, చంద్రశేఖర్, మనోహర్, శీతల్, శివప్రసాద్, అశోక్, వామన్ పాల్గొన్నారు.

బీసీ సంఘం కప్పర్ల గ్రామకమిటీ ఎన్నిక

తాంసి: మండలంలో నూతన బీసీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం కప్పర్ల గ్రామ బీసీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లన్న, ఉపాధ్యక్షుడిగా ఉత్తం, కార్యదర్శిగా మహేందర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సదానంద్, కొడాల మహేందర్, దారవేణి రాఘవేంద్ర, సంతోశ్ ఉన్నారు.

నేడు..

లోక్ అదాలత్

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ టి. దుర్గారాణి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బ్యాంకు కేసులు, తదితర కేసులు ఉన్న వాళ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదిలాబాద్ పట్టణంతో పాటు ఆదిలాబాద్‌రూరల్ మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని కైలాస్‌నగర్, కలెక్టర్‌చౌక్, పాత హౌజింగ్ బోర్డు, షాద్‌నగర్‌లలో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ, అంకోలి సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మోచిగల్లి, ద్వారకానగర్, విద్యానగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిచి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సంక్షిప్తం..

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో గల వృద్ధాశ్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం అన్నదానం నిర్వహించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లింగోజితండా గ్రామానికి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మొదటిసారి రావడంతో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, వైస్ ఎంపీపీ బాలాజీ, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్‌లు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు.

దరఖాస్తు తేదీని పొడిగించాలి

ఉట్నూర్‌రూరల్: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులు చేసుకొనే వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించడం హర్షనీయమని, దరఖాస్తు చేసేందుకు గడువు పొడిగించాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కట్ట లక్ష్మణచారి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నిబంధనల ప్రకారం కులం, ఆదాయం సర్టిఫికెట్లు తీసుకునేందుకు కనీసం 20 రోజులు పడుతుందన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన గోరక్షణ దళ్ సభ్యుడు శంకర్ గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో అక్రమదారులు దాడి చేయడంతో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న నేరడిగొండ బీజేపీ నాయకులు ఆయనను ఆస్పత్రికి తరలించారు. పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో సీసీరోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఉట్నూర్ డీఎస్పీ నరేందర్ భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాం జాదవ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, సీఐ సైదారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రుయ్యాడి పీరీలకు ఘనమైన చరిత్ర

తలమడుగు: రుయ్యాడి పీరీలకు ఘనమైన చరిత్ర ఉందని విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి అన్నారు. మండలంలోని రుయ్యాడి గ్రామంలో గల హస్సేన్ హుస్సేన్ ఆలయంలో రూ.40 లక్షలతో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ పోతారెడ్డి, సీఈవో మోతె శ్రీనివాస్, జిల్లా సహకార సంఘం డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సాంబశివ పాల్గొన్నారు.

బీసీ కులాలన్నింటికీ లక్ష రూపాయలు ఇవ్వాలి

బోథ్: బీసీ కులాలందరికీ రూ. లక్షలను వర్తింపజేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ తూము సూర్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. బీసీలకు కార్పొరేషన్ లోన్లు ఇవ్వకుండా రూ. లక్ష ఇస్తామని ప్రకటించి, ఇప్పుడు కేవలం 15 కులాలకు మాత్రమే వర్తింపజేయడం సరికాదన్నారు. పద్మశాలి, గౌడ, మున్నూరు కాపు, ముదిరాజ్‌లతో పాటు బీసీ కులాలందరికీ ఇవ్వాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

'ప్రజాధనంతో బీఆర్ఎస్ కార్యకర్తల జల్సాలు'



మాట్లాడుతున్న సరేష్ జాదవ్

గుడిహత్నూర్: ప్రజాధనంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జల్సాలు చేస్తున్నారని ఏఐసీసీ మెంబర్ నరేష్ జాదవ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో మందు విందులతో చిందులు వేయడం ఎంత వరకు సమంజసమన్నారు. కుప్టి ప్రాజెక్టుపై సీఎం కేసీఆర్ ఊసెత్తడం లేదన్నారు. గిరిజన యూనిర్సిటీని తీసుకురావడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్యాల కరుణాకర్, లాందాడే నాగ్‌నాథ్ అప్పా, ఆరీఫ్ ఖాన్, గోవింద్, నగేష్, కొట్నక రమేష్, ప్రేమ్, కపిల్ పాల్గొన్నారు.

క్రీడా మైదానానికి స్థలం కేటాయించండి



వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

నేరడిగొండ: మండలంలో క్రీడా మైదానం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని క్రీడాకారులు అన్నారు. క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేరడిగొండ జాతీయ రహదారికి అనుకొని ఉండడంతో రోడ్డుపై వాకింగ్ చేయాల్సి వస్తుందని వాపోయారు. సరైన క్రీడా స్థలం లేక ఆటలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు అనిల్, శ్యామ్, గణేశ్, ఉదయ్, యోగి, రవి, పాండు, గ్రామస్తులు పాల్గొన్నారు.